క్లుప్తంగా

ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి



ఉత్సవాలపై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: జరగబోయే గణపతి నవరాత్ర మహోత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. గణపతి నవరాత్ర మహోత్సవాలపై తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేయబోయే గణపతి మందిరాలు, ఆలయాల వద్ద నిర్వహించబోయే ఉత్సవాలకు సంబంధించి ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు అనుమతులు తప్ప సరిగా పొందాలన్నారు. ముఖ్యంగా ఎన్ని రోజులు నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఏ ప్రాంతంలో నిమజ్జనం చేస్తారు, ఉత్సవాలకు సంబంధించి అన్ని వివరాలను అనుమతులు పత్రంలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో హరికష్ణ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మండల మహాసభను జయప్రదం చేయాలి

కొత్తపల్లి: వచ్చే నెల ఒకటో తేదీన స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్న భవన, ఇతర నిర్మాణ కార్మికుల నాలుగో మండల మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు కోరారు. గురువారం ఎండపల్లిలో ఈ సమావేశానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కె.నాగేశ్వరరావు, కె.వి.వి.సత్యనారాయణ, సాంబశివకుమార్, మండల సీపీఎం కన్వీనర్ జి.అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆదినారాయణ ఇక లేరు



సంగీత విద్వాంసుడు ఆదినారాయణ(ఫైల్)

పెద్దాపురం: పట్టణ ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఎందరికో సంగీత విద్య నేర్పిన పెద్దాపురం పట్టణానికి చెందిన సంగీత గురువు పెనుమర్తి ఆదినారయణ ఇకలేరు. తుని మండలంలోని బంధువులు ఇంట జరిగిన ఫంక్షన్‌కు వెళ్లి తిరిగివస్తున్న సమయంలో ఆయన రోడ్డు ప్రమాదంలో లారీ టైర్లు ఆయనపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనతో పాటు పయనిస్తున్న తోడల్లుడు కుమారుడు వెంకటేశ్వరరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పట్టణంలో మంచి గుర్తింపు చెందిన ఆదినారాయణ మృతితో పెద్దాపురం పట్టణంలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై పట్టణ ప్రముఖులు, కళాకారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

44 మందికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపిన కేసుల్లో నలుగురికి ఐదు రోజుల చొప్పున జైలు, 20 మందికి మూడు రోజుల చొప్పున, మరో 20 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో 44 మందిని హాజరుపర్చగా వారికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సత్రం కూల్చివేతపై దేవదాయ కమిషనర్‌కు నివేదిక

అన్నవరం: రత్నగిరిపై వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రాన్ని కూల్చి వేయాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు ఇచ్చిన నివేదికపై తదుపరి ఉత్తర్వుల కోసం దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌కు ఫైల్ పంపించినట్టు దేవస్థానం అధికారులు గురువారం తెలిపారు. అలాగే ఈ సత్రంలోని గదులను భక్తుల వసతికి అద్దెకు ఇవ్వడాన్ని నిలిపివేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. జేఎన్‌టీయుకే ప్రొఫెసర్లు నివేదిక ప్రకారం ఇది కూలిపోయే పరిస్థితిలో ఉన్నందున ఒక వేళ భక్తులు ఈ సత్రంలో బస చేసినపుడు కూలిపోతే ప్రాణాపాయం తప్పదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కూడా స్పష్టత ఇవ్వాలని కమిషనర్‌ను కోరినట్లు అధికారులు తెలిపారు. కాగా జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు నివేదికపై చర్చించి త్వరలోనే ఆదేశాలిస్తామని కమిషనర్ చెప్పినట్టు అధికారులు వివరించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

బోట్‌క్లబ్: స్థానిక వృద్ధుల ఆశ్రమంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, శ్రీవల్లి, నాగేంద్ర, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినూత్న విగ్రహాలు

- పర్యావరణ పరిరక్షణలో భాగస్వామిగా తాపీమేస్త్రి
- వినూత్న వినాయక విగ్రహాల తయారీలో వీరబాబు



వీరబాబు తయారు చేసిన పసుపు వినాయక విగ్రహం (ఫైల్)



పసుపు కొమ్ములతో వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్న వీరబాబు



వరి పిండితో చేసిన వినాయక విగ్రహం (ఫైల్)



రుద్రాక్షలతో చేసిన వినాయక విగ్రహం (ఫైల్)

పిఠాపురం: పండుగ పేరు చెప్పి ప్రకృతికి హాని కలిగించడం తప్పు అని చెబుతూ పర్యావరణ పరిరక్షణ మన ధ్యేయమంటూ చాటుతున్నాడు ఆయన. పర్యావరణానికి మేలు చేసే విధంగా భక్తి ముక్తి కలిసి వచ్చేలా ఆయన చేస్తున్న ప్రయత్నాలు పలువురి ప్రశంసలందుకుంటున్నాయి. వివిధ రకాల రసాయనాలతో తయారు చేసే వాటి వల్లే కలిగే నష్టాలు పర్యావరణానికి కలిగే ఇబ్బందులు ప్రజలకు తెలియజేయాలన్న గొప్ప ఆలోచనతో ఒక్కో రకం వినూత్న వినాయక విగ్రహాల తయారీకి పూనుకున్నాడు గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన తాపీ మేస్త్రి చెందిన కోలా వీరబాబు. వినాయక చవితి వస్తుందంటే గ్రామాల్లో వీధి వీధిలోను వినాయక మంటపాలు వెలుస్తుంటాయి. ఒకరిపై ఒకరు పోటీగా రంగురంగుల భారీ నుంచి అతి భారీ వినాయక విగ్రహాల మండపాలు ఏర్పాటు చేస్తుంటారు. వీటిలో ఎక్కువగా పర్యావరణానికి హానికరమైన ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలే ఎక్కువగా ఉంటాయి. ఇళ్ల నిర్మాణ పనుల్లో నేర్చుకున్న మెళకువలను ఉపయోగించి కేవలం తన చేతితో ఎటువంటి పర్యావరణ కాలుష్యం లేని విధంగా విగ్రహాలు తయారు చేస్తు అందరితో ప్రశంసలు అందుకుంటున్నాడు. ఒక్కో ఏటా ఒక్కో రకమైన వినాయక విగ్రహాన్ని తయారు చేస్తుంటాడు. గతంలో 45 కిలోల వరి పిండితో మూడున్నర అడుగుల వినాయక విగ్రహాన్ని తయారు చేశాడు. 30 కేజీల పసుపుతో సుమారు 5వేల రుద్రాక్షలతో నాలుగు అడుగుల వినాయకుడి విగ్రహంతోపాటు 3 అడుగుల శివలింగాన్ని తయారు చేశాడు. ఈ ఏడాది పసుపు కొమ్ములతో వినూత్నంగా వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు వీరబాబు. ఈ విగ్రహాలకు ఆయన వినాయక చవితి ఉత్సవాల్లో నిలిపి పూజలు చేసి తర్వాత భక్తులకు పంచిపెడుతుంటాడు. పసుపు కొమ్ముల విగ్రహాన్ని చూడడానికి స్థానికులు క్యూకడుతున్నారు.

అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో..

ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఏటా పర్యావరణానికి హాని చేయని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాను. నేను చేసే వరి పిండి, పసుపు, రుద్రాక్షలు వంటివి పర్యావరణానికి ఎటువంటి హాని చేయవు. వీటిని పూజల అనంతరం ఉపనయోగించుకునే అవకాశం కూడా ఉంది. విగ్రహాల ఆకర్షణ కోసం రంగుల పేపర్లతో అలంకరణ చేస్తుంటాను. వీటి తయారీని చూసి ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లల్లో పసుపు, కుంకుమ, వరి పిండి తదితర వాటితో వినాయక ప్రతిమలు తయారు చేసుకుని పూజించుకోవచ్చు. నేను తయారు చేసిన విగ్రహాలను మా వీధిలో వినాయక మండపంలో ఉంచి నవరాత్రులు పూజలు చేస్తాం. విగ్రహాలు చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.

– కోలా వీరబాబు, తాపీమేస్త్రీ, గొల్లప్రోలు

ముందడుగు వేస్తున్న న్యాక్ సంస్థ

సామర్లకోట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) మరింత ముందుకు వేస్తుందని న్యాక్ కాకినాడ జిల్లా అసిస్టెంట్ డైరెక్టరు జె.రాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న న్యాక్ సంస్థ గృహ నిర్మాణ రంగంలో నిరుద్యోగ యువకులకు శిక్షణ ఇచ్చి అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శ్రామిక శక్తిని మరింత ముందుకు తీసుకు వెళ్లడానికి ప్రపంచ నిర్మాణ, కాంక్రీటింగ్ పరికారాల తయారీదారులలో ఒకటైన ష్వింగ్ స్టెటర్ (ఇండియా) కంపెనీతో న్యాక్ ప్రతినిధులు ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర న్యాక్ డైరెక్టరు జనరల్ గుమ్మల గణేష్‌కుమార్, అదనపు డైరెక్టరు జనరల్ మనోహర్ దేవపట్ల సమక్షంలో స్వింగ్ స్టెటర్ తరుపున వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఆనందకుమార్ ఒప్పందంపై సంతకాలు చేశారన్నారు. దాంతో రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుందని న్యాక్ అదనపు డైరెక్టరు జనరల్ మనోహర్ అభిప్రాయ పడిన్నట్టు చెప్పారు. ఈ ఒప్పందంకు తగిన విధంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి మార్గాలు సులభతరం అవుతాయని తెలిపారు. సామర్లకోటలోని శిక్షణా సంస్థలో మరింత నైపుణ్యంతో శిక్షణ ఇచ్చే ఫ్యాకల్టీలను తయారు చేస్తామన్నారు. అంతర్జాతీయ ఉపాధి మార్కెట్‌కు తగిన రీతిలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ పొందిన శ్రామిక శక్తి రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు నేరుగా దోహదపడుతుందన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ చరిత్ర సృష్టించిన వ్యక్తి రామారావు

- చేనేత రంగ అభివృద్ధికి కృషి
- ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు



ముప్పన రామారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీర్రాజు

పెద్దాపురం: దక్షిణ భారత స్థాయిలో జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడమే గాక, ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ చరిత్ర సృష్టించిన మహానేత, అపరభగీరదుడు ముప్పన రామారావు అని, ఆయన ఆశయ సాధన కోసం చేనేత రంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. రామారావు జయంతి పురస్కరించుకుని పెద్దాపురం పట్టణ చేనేత వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధి ఆరంభం అయ్యిందంటే తన తండ్రి రామారావు చలువతోనే నన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ చేనేత రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తొలుత స్థానిక మున్సిపల్ సెంటర్ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని రెండు చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లోనూ రామారావు జయంతి నిర్వహించి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూతిక సత్యన్నారాయణ, కె.సత్తిబాబు, మల్లిబాబు, ప్రకాష్, జయ, రాజు, పురుషోత్తం, చంద్రరావు, శ్రీను, శేఖర్, చేనేత సహకార సంఘాల సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం కావాలి



వలంటీర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి

సామర్లకోట: మండల పరిధిలో నిరక్షరాస్యులు లేకుండా చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి మండల పరిధిలో ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన వలంటీర్లు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేస్తారన్నారు. మండలంలో కనీసం వెయ్యి మందిని లెర్నర్స్‌ను గుర్తించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య, ఏపీఎం జగదీశ్వరి, వయోజన విద్యా సంస్థ డిప్యూటీ డైరెక్టరు అనిశెట్టి వెంకట్రావు, ఎం.నాగేశ్వర రావు, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వి.అనిల్‌ఆనందబాబు, స్టాటిస్టికల్ అసిస్టెంట్ పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: మాధవపట్నంలోని 33 కేవీ, 11 కేవీ రామేశ్వరం ఫీడర్లు మరమ్మతులు కారణంగా గ్రామాల్లో విద్య్యుత్ సరఫరాకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మలు కారణంగా మాధవప్నం, వీకే రాయపురం, మామిళ్లదొడ్డి, జి.మేడపాడు, జి.కొత్తూరు, పీబీ దేవం, ఇళ్లపల్లి గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

కొత్తపల్లి: మూలపేటలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త మూలపేటలోని వీధిలైట్ల మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పెద్దాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రభాకర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బారులు తీసిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జిపై అడుగుఅడుగునా గోతులు ఉండడంతో వాహనాల యజమానులు గోతులను తప్పించుకొనే క్రమంలో వెడమ వైపు నుంచి కుడి వైపునకు వస్తున్నారు. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలకు మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. గత వారం రోజులుగా ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులను పూడ్చకపోవడంపై వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పెద్దాపురం-రాజానగరం ఏడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాల నుంచి వచ్చే బస్సులతో బ్రిడ్జి రద్దీగా ఉంటుంది. ఇటువంటి సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో కళాశాలలకు చెందిన విద్యార్థులు రోడ్డుపైకి దిగడంతో చిన్న వాహనచోదకులు కూడా రాకపోకలు సాగించడానికి అవకాశం ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈనెల 23న పెద్దాపురం నియోజకవర్గంలో సీఎం పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కాకినాడ నుంచి జిల్లా కలెక్టరు, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు రాకపోకలు చేయడం పోలీసులు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

వెంటనే సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీల ధర్నా



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సామర్లకోట: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీల వేతనం పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని, పని చేయని సెల్‌ఫోన్లు వద్దని నినాదాలు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ కార్యదర్శి వడ్డీ ఎస్తేరురాణి మాట్లాడుతూ 2014 నుంచి అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచలేదన్నారు. ఈ మధ్య కాలంలో పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్లు ఇచ్చారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు దానిని పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహణకు ఇచ్చినఫోన్లు పని చేయడం లేదని, పోషణ ట్రాకరు, బాలసంజీవిని యాప్స్ అమలుకు ఫోన్లు సపోర్టు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో ఉన్న సెంటర్లకు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాపోయారు. అధికారులు లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్, ఓటీపీ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనలు అమలు చేయడానికి అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్న సరకులు ఒకేసారి రావడం లేదని ఆరోపించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సెక్టారు నాయకులు జి.మహాలక్ష్మి, ఎస్ మంగాలక్ష్మి, ఎస్‌కే ఫాతిమా, పి.రాజేశ్వరీ, కె.వరలక్ష్మి నాయకత్వం వహించారు. ఆందోళన అనంతరం అంగన్‌వాడీల సమస్యపై తహసీల్దార్ కొవ్వూరి చంద్ర శేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తహశీల్దారు చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. వేతనాల పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యూటీ జీవోలో మార్పులు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి, రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి వేతనాలు పెంచలేదని వాపోయారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు సంబంధించి యాప్‌లు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఫోన్లు సహకరించడం లేదని ఇటువంటి సమస్యలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

అవైర్‌నెస్ ఏదీ?

- యమపాశాల్లా విద్యుత్ తీగలు
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు

కాకినాడ లీగల్: విద్యుత్.. నిత్య జీవితంలో ఎంతో కీలకమైంది. అలాంటి విద్యుత్ విషయంలో అవగాహన లేకుంటూ ప్రాణానికే ముప్పు వస్తోంది.. అయినా ఆ శాఖలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. కాకినాడ నగరంలో ఏ వీధిలో చూసినా స్తంభాల నుంచి విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉండి కిందకు వేలాడుతూ ప్రమాదాలను సూచిస్తోంది. ఒకే విద్యుత్ స్తంభంపై ఎక్కువ సర్వీసులు ఉండడం, భవనాలకు ఆనుకుని విద్యుత్ తీగలు వేలాడడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నెలకొంది. విద్యుత్ స్తంభాలకే పలు కేబుల్ వైర్లు వేసినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కేబుల్ సర్వీసు వైర్లు విద్యుత్ స్తంభాల నుంచి నేలపైకి వేలాడుతుండడంతో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విధంగానే పాఠశాలల వద్ద ఉండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తీగలు ఒక దానితో ఒకటి కలసిపోవడంతో విద్యుత్ ప్రవాహంలో తేడాలు వచ్చి ఇంట్లో విలువైన వస్తువులు కాలిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలపై విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉండడం, వాటికి తోడు కేబుల్ వైర్లు కట్టడంతో ఏ ఇంటికో విద్యుత్ అంతరాయం కలిగితే స్తంభంపై ఉన్న వైర్లను తప్పించి మరమ్మతులు చేయడానికి విద్యుత్ సిబ్బంది నరకం చూస్తున్నారు. స్థానిక గాంధీనగర్‌లో ఒంటిమామిడి జంక్షన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తీగలు కిందకు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేదు. రామారావుపేట నాగేశ్వరరావు వీధిలో చేతికందే ఎత్తులో ఉన్న ఫ్యూజ్ బాక్స్ ఉంది. గాంధీనగర్ వద్ద గాంధీ విగ్రహం సమీపంలో పిచ్చిమొక్కలు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇక్కడ తరచూ మంటలు వస్తున్నాయి. గాంధీనగర్ రెడ్‌క్రాస్ వీధిలో విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. నగరంలో అనేక విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లు, అనేక ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు చుట్టూ కంచెలు లేవు.

ఏదో ఒకచోట ప్రమాదం

రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వాహనాలు కాని, ఇతర ఏ దుకాణాలు ఉన్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నగరంలో ఏదో ఒకచోట ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయందోళన చెందుతునారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కనీసం రక్షణగా ఉండే కంచె ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



నాగేశ్వరరావు వీధిలో చిన్న పిల్లలకు అందే ఎత్తులో ఉన్న ఫ్యూజ్ బాక్సు



గాంధీ విగ్రహం సమీపంలో పిచ్చిమొక్కల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రెడ్‌క్రాస్ వీధిలో విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు కిందకు వేలాడుతూ..

మరమ్మతులు చేయించండి



నగరంలో ఏ విద్యుత్ స్తంభం చూసిన విద్యుత్, కేబుల్ తీగలతో అస్తవ్యస్తంగా ఉంటోంది. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు ఉండడంతో ఎవరికైనా తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఉండడం లేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి మరమ్మతులు చేయించడం, విద్యుత్, కేబుల్ తీగలను సరిచేయడం చేయాలి.

– జీఎస్‌ఆర్ కృష్ణారావు, స్థానికుడు

గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం



నాయి బ్రాహ్మణ కాలనీలో పందిరి రాటను వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దాపురం: ఈ నెల 27వ తేదీ వినాయక చవితి సందర్భంగా నిర్వహించే గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. పెద్దాపురం నాయీ బ్రాహ్మణ కాలనీలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు తమిరి శ్రీను, వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. భక్తులు పూజల్లో భాగస్వాములుకావాలని వారు కోరారు.

భవిష్యత్తుకు పునాదులు వేయండి

కాకినాడ రూరల్: ఉపాధ్యాయులు ఉత్సాహంగా పనిచేసి, మంచి బోధనతో విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని డీఈఓ పి.రమేష్ సూచించారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం మండల పరిధిలోని ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా పని చేయాలని, రోల్ పెంచాలని సూచించారు. మెరుగైన ఫలితాల కోసం మోటివేషన్ చేశారు.